క్లుప్తంగా

16న మండల సర్వసభ్య సమావేశం

చాపాడు : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో ఈ నెల 16న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు నివేదికలతో హాజరుకావాలని, ఇదే క్రమంలో మండలంలోని ప్రజా ప్రతినిధులందరూ హాజరైన ప్రజా సమస్యలపై చర్చించాలని కోరారు.

కుష్టు వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న డిప్యూటీ పారామెడికల్ అధికారి శివశంకరయ్య

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రతి ఒక్కరూ కుష్టు వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ ప్యారామెడికల్ అధికారి శివశంకరయ్య తెలిపారు. సోమవారం జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన పక్షోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక వైవీఎస్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు కుష్టువ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించి ఎండీటీ మందులు వాడితే అంగవైకల్యాన్ని అరికట్టవచ్చన్నారు. కుష్టువ్యాధి గ్రస్తులను ఆదరించాలని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెడ్మాస్టర్ లక్ష్మీనరసమ్మ, కమ్యూనిటీ ఆర్గనైజర్ ఎంవీ సుబ్బారెడ్డి, హెల్త్ సెక్రటరీ కేశమ్మ, ఆశా వర్కర్ తులసి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దళితుల సంక్షేమానికి కృషి



యర్రగుడి చంద్రబాబును సన్మానిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : దళితుల సంక్షేమానికి కృషి చేస్తానని షెడ్యూల్డ్ క్యాస్ట్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు యర్రగుడి చంద్రబాబు పేర్కొన్నారు. స్థానిక ఎస్సీఆర్పీఎస్ కార్యాలయంలో సోమవారం పలు కుల, కార్మిక సంఘాల నాయకులు చంద్రబాబు రాష్ట్ర అధ్యక్షుడు ఎన్నికైన సందర్భంగా సన్మానించారు. వార్డు మెంబర్ బాలయ్య, బలిజ సంఘం నాయకుడు నాగప్రసాద్, స్వర్ణకారుల సంఘం నాయకుడు షేక్‌ఖాజా, నజీర్, రసూల్, మహబూబ్‌బాషా, మైనార్టీ నాయకుడు గౌస్‌బాషా, అబ్దుల్ ఖాదర్, బండి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నక్కలదిన్నె-వెదురూరు రోడ్డుకు మరమ్మతులు



దెబ్బతిన్న రోడ్డుపై మరమ్మతులు చేస్తున్న దృశ్యం

చాపాడు : మండలంలోని నక్కలదిన్నె-వెదురూరు గ్రామాల మధ్య రోడ్డు మరమ్మతులు చేపట్టారు. ఇటీవల వలన ఈ దారి దెబ్బతినటం వలన ఆయా గ్రామాల ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రూ.9లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టామని త్వరలోనే ఈ దారి చాపాడు నుంచి వెదురూరు వరకూ పునర్నిర్మించటం జరుగుతుందని ఆర్ అండ్‌బీ ఏఈ దాదాబాషా తెలిపారు. ఇప్పటికే పనులు ముమ్మురంగా జరుగుతున్నాయని దెబ్బతిన్న చోట్ల రోడ్డును తొలగించి కొత్త రోడ్డు వేయడం జరుగుతుందని పనులు నాణ్యతగా చేస్తున్నట్లు ఏఈ తెలియజేశారు.

రేపు వైద్య శిబిరం

చెన్నూరు : ఈనెల 15న కొండపేటలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు స్థానిక ప్రముఖులు సుధాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన చెన్నూరులో విలేకరులతో మాట్లాడారు. దివంగత పెడబల్లి సుబ్బారెడ్డి, పెడబల్లె శివారెడ్డి సంస్మరణగా వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పుష్పగిరి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు.

సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లండి



కిట్లను అందజేసిన సింగిల్‌విండో అధ్యక్షుడు, మండల సచివాలయ కన్వీనర్



బద్వేల్ అర్బన్: గృహసారథులకు కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

బద్వేలు అర్బన్ : వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి రాబోవు ఎన్నికల్లో మళ్ళీ వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు సైనికుల్లా పనిచేయాలని అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అడా) చైర్మన్ సింగసాని గురుమోహన్, మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ కన్వీనర్ ఈగ యద్దారెడ్డిలు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని వేర్వేరు ప్రాంతాల్లో కోటవీధి, గాండ్లవీధి, అశోక్‌నగర్, శీలంవారిపల్లె, అగ్రహారం సచివాలయాల పరిధిలోని గృహ సారథులు, సచివాలయ కన్వీనర్‌లకు 'మా నమ్మకం నువ్వే జగన్' కిట్లు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో వారు మాట్లాడుతూ గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు నిత్యం ప్రజల్లో ఉంటూ గత ప్రభుత్వ హయాంలో అందుతున్న పథకాలు, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందుతున్న పథకాల మధ్య తేడాలను ప్రజలకు వివరించి వారిని చైతన్యపరచాలన్నారు. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ, కౌన్సిలర్ వరలక్ష్మి, వార్డుల ఇన్‌చార్జిలు బిజ్జం రమణ, శ్రీనివాసయాదవ్, అనిల్, ఆవుల శ్రీను, ఖాజాలతో పాటు ఆయా వార్డుల సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

రెట్టించిన ఉత్సాహంతో పార్టీ విజయానికి కృషి చేయాలి

గోపవరం : 2024 ఎన్నికల్లో మళ్ళీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలని సింగిల్‌విండో అధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ పుల్లయ్యలు అన్నారు. సోమవారం మండలంలోని టి.సండ్రపల్లె సచివాలయం పరిధిలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు 'మా నమ్మకం నువ్వే జగన్' కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు నిత్యం ప్రజల్లో ఉంటూ గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీల్లో ఏ మేరకు నెరవేర్చారో ప్రజలకు తెలియపరుస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ నాలుగేళ్ల పాలనలో పార్టీలకు అతీతంగా, కులమతాలు తేడా లేకుండా ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల వలన మేరకు లబ్ధి చేకూరిందో అన్న విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళాలన్నారు. వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు సమన్వయంతో పార్టీ విజయానికి కృషి చేయాలని తెలిపారు.

రాచమల్లు కుటుంబానికి రుణపడి ఉంటా

- వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ద్వారానే ఈ గౌరవం దక్కింది
- ప్రమాణ స్వీకారోత్సవంలో కో–ఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జల కళావతి



కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలుగా నియామక పత్రం అందుకుంటున్న గజ్జల కళావతి

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలో సాధారణ కార్యకర్తగా కొనసాగుతున్న తనను గుర్తించి ఈ పదవి ఇచ్చినందుకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి కుటుంబానికి ఎల్లప్పుడు రుణపడి ఉంటానని ది ప్రొద్దుటూరు సెంట్రల్ కన్స్యూమర్స్ కోఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్ నూతన అధ్యక్షురాలు గజ్జల కళావతి తెలిపారు. పాలక వర్గ సభ్యులు ఎన్నికల అధికారి అరుణ కుమారి సమక్షంలో గజ్జల కళావతిని అధ్యక్షురాలుగా, హనుమాన్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు వెంకటస్వామిని ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం పాలకవర్గ సభ్యులచే ఎన్నికల అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా గజ్జల కళావతి మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆవిర్భావం నుంచి తాను సాధారణ కార్యకర్తగా పనిచేస్తున్నానన్నారు. తర్వాత ఎమ్మెల్యే తనను నియోజకవర్గ అధ్యక్షురాలిగా నియమించారని తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డిలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాలక వర్గ సభ్యులు వెల్లాల వినోద్ కుమార్‌రెడ్డి, రంగనాయకులు, లక్ష్మీరంగారెడ్డి, మంచాల మదన్‌కుమార్, మహ్మద్ షబ్బీర్, ఎస్.శ్రీరాములు, రాచమల్లు రమాదేవి, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, నాగరాజు, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు మల్లేల రాజారాంరెడ్డి, వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, వార్డు సచివాలయాల కన్వీనర్ల ఇన్‌చార్జి కాకర్ల నాగ శేషారెడ్డి, కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, గరిశపాటి లక్ష్మీదేవి, వంశీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

15న సమర్థ రామదాస స్వామి ఆరాధనోత్సవం



ప్రత్యేక అలంకరణలో సద్గురు సమర్థ రామదాస స్వామి

ప్రొద్దుటూరు : మండలంలోని ఉప్పరపల్లె గ్రామంలోని శ్రీ సద్గురు సమర్థ నారాయణ స్వామి ఆశ్రమంలోని గోశాలలో ఈనెల 15న బుధవారం సద్గురు సమర్థ రామదాస స్వామి (ఛత్రపతి శివాజీ గురువు) ఆరాధనోత్సవం నిర్వహించనున్నట్లు అర్చకుడు నాగేంద్ర స్వామి తెలిపారు. ఉదయం అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజలు చేసి మహా మంగళహారతి, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాయంత్రం గ్రామోత్సవం ఉంటుందని వివరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ప్రజాస్వామ్యం మాటున నియంతృత్వ పోకడలు

ప్రొద్దుటూరు : ప్రభుత్వాలు ప్రజాస్వామ్యం మాటున నియంతృత్వ పోకడలను అమలు చేస్తున్నాయని ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకుడు గాలి చంద్ర విమర్శించారు. మండలంలోని పెన్నానగర్‌లోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో సోమవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా 19వ మహాసభలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం ద్వారా మతోన్మాదాన్ని బలవంతంగా విద్యార్థులపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వాల నియంతృత్వ పోకడలను విద్యార్థి పోరాటాల ద్వారా బుద్ధి చెప్పాలన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టివేసే జీఓ 117ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు మాట్లాడుతూ రాష్ట్ర విభజన హామీల్లో పొందుపరిచిన కడప ఉక్కు పరిశ్రమకు నిధులు కేటాయించి పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. మైనారిటీల విద్యాభివృద్ధికి తోడ్పడే మౌలానా ఆజాద్ స్కాలర్ షిప్‌ల రద్దును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్, జిల్లా నాయకులు శరత్, లీలా, చైతన్య, శివశంకర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తనిధి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రొద్దుటూరు పట్టణంలో మరొక రక్తనిధి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కడప కలెక్టర్ ఆఫీసులో డీఆర్ఓ గంగాధరగౌడ్‌కు వినతి పత్రం అందచేశారు. పట్టణంలో ఒక ప్రభుత్వ, ఒక ప్రైవేటు బ్లడ్ బ్యాంక్‌లు ఉన్నాయని అధిక జనాభా గల ప్రొద్దుటూరు పట్టణంలో మరొక బ్లడ్‌బ్యాంక్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. పలు స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులు సిరాజుద్దీన్, శంకర్, కొండారెడ్డి, సత్యనారాయణ, విష్ణువర్ధన్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అప్పర్ భద్ర ప్రాజెక్టుతో సీమ ఎడారే

ప్రొద్దుటూరు : కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న అప్పర్ భద్ర ప్రాజెక్టుతో రాయలసీమ ఎడారిగా మారుతుందని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కర్ణాటకలో త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి పొందడానికి కేంద్ర ప్రభుత్వం అప్పర్ భద్ర ప్రాజెక్టు జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి బడ్జెట్‌లో రూ.5,300 కోట్లు నిధులు కేటాయించినట్లు ఆయన పేర్కొన్నారు. రాయలసీమ బీజేపీ నాయకులు ఈ ప్రాజెక్టుపై తమ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 25 నుంచి మూడు రోజులపాటు రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహిస్తున్నామని, సీమ వాసులు పాదయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: కర్ణాటక రాష్ట్రంలోని అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపాలని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రవిశంకర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపాలని కోరుతూ అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణాన్ని వెంటనే ఆపి రాయలసీమకు నీటి కేటాయింపులు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం వైఖరికి నిరసగా సుప్రీం కోర్టుకు వెళ్లి అప్పర్ భద్ర ప్రాజెక్టును అడ్డుకోవాలన్నారు.

రేపు క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్

బద్వేలు అర్బన్ : హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో స్థానిక రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కళాశాల ఏఓ, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి. సాయిక్రిష్ణ, ప్రిన్సిపల్ సత్యనారాయణలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ ఆఫీసర్, ట్రైనీ, జూనియర్ కెమిస్ట్, ఆపరేటర్ వంటి ఉద్యోగాలకు నిర్వహిస్తున్న ఈ క్యాంపస్ డ్రైవ్‌లో పాల్గొనే అభ్యర్థులు బీఎస్సీ-కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ-కెమిస్ట్రీ, బి.ఫార్మసీ, బీకాం, ఐటీఐ (ఫిట్టర్, డిప్లమా మెకానికల్)లలో 2019 నుంచి 2022 విద్యా సంవత్సరంలో కోర్సు పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు హాజరయ్యే అభ్యర్థులు సంబంధిత సర్టిఫికెట్లు, బయోడేటా, పాస్‌పోర్టు సైజు ఫోటోలు, ఆధార్ కార్డుతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలి



పోస్టల్ సేవల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సూపరింటెండెంట్ కేపీ రవిబాబు తదితరులు

ప్రొద్దుటూరు కల్చరల్ : తపాలాశాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ సూపరింటెండెంట్ కేపీ రవిబాబు పేర్కొన్నారు. స్థానిక ప్రధాన తపాలా కార్యాలయంలో సోమవారం తపాలా సేవలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు డివిజన్ సంబంధించి 376 పోస్టాఫీస్‌ల ద్వారా సేవలందిస్తున్నామన్నారు. వీటిలో రెండు ప్రధాన కార్యాలయాలు, 49 సబ్ పోస్టాఫీస్‌లు, 325 బ్రాంచ్ పోస్టాఫీస్‌లు ఉన్నాయన్నారు. ఈ నెల 9, 10 తేదీల్లో బాలికల కోసం ప్రవేశ పెట్టిన సుకన్య సమృద్ధి యోజన పథకాల 1300 అకౌంట్‌ను చేసినట్లు తెలిపారు. వృద్ధులకు అత్యధికంగా డిపాజిట్‌లకు 8 శాతం వడ్డీ ఇస్తున్నామన్నారు. కేవలం ఏడాదిలో రూ.399 భీమాతో రూ.10లక్షల ప్రమాద భీమా కల్పిస్తోందని ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పోగొట్టుకున్న మొబైల్ అప్పగింత



యువకుడికి ఫోన్‌ను అందిస్తున్న అర్బన్ ఎస్ఐ శ్రీకాంత్

బద్వేలు అర్బన్ : ఓ యువకుడు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను అరగంట వ్యవధిలోనే గుర్తించి బాధితుడికి అప్పగించి అర్బన్ పోలీసులు శభాష్ అనిపించుకున్నారు. సోమవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళితే మున్సిపాలిటీ పరిధిలోని తొట్టిగారిపల్లె గ్రామానికి చెందిన సిద్దయ్య అనే యువకుడు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళుతూ పొరపాటున నాలుగు రోడ్ల కూడలి సమీపంలో మొబైల్ ఫోన్‌తో పాటు పర్సును పోగొట్టుకున్నాడు. ఈ సమయంలో ఓ వ్యక్తి మొబైల్ ఫోన్‌ను, పర్సును తీసుకుంటుండగా అక్కడే వాహనాల తనిఖీ చేస్తూ విధుల్లో ఉన్న అర్బన్ ఎస్ఐ శ్రీకాంత్ సదరు వ్యక్తి నుంచి మొబైల్ ఫోన్‌ను, పర్సును స్వాధీనం చేసుకున్నారు. ఇంతలో మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న యువకుడు వేరే ఫోన్‌తో తన మొబైల్‌కు ఫోన్ చేయగా ఫోన్ తమ వద్ద ఉందని, నాలుగు రోడ్ల కూడలికి వచ్చి తీసుకోవాలని ఎస్ఐ చెప్పడంతో యువకుడు వచ్చాడు. మొబైల్ ఫోన్‌ను, పర్సును యువకునికి అందించారు. యువకుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ గంగన్న, కానిస్టేబుల్ ఓబులేసు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను బడికి పంపించాలి



విద్యార్థినిని పాఠశాలకు రావాలని చెబుతున్న సీఆర్పీలు

ప్రొద్దుటూరు కల్చరల్ : బడి ఈడు పిల్లలను తప్పకుండా బడికి పంపించాలని సీఆర్పీలు విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. 'మన బడికి పోదాం' కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని దొరసానిపల్లె, జంగంపేట, హనుమాన్‌నగర్, ప్రాంతాల్లో బడి మానేసిన 12 మంది విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యార్థులను తప్పకుండా పాఠశాలలకు పంపించాలని తల్లిదండ్రులకు తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన అమ్మఒడి, జగనన్న గోరుముద్ద, బైజూస్ తదితర పథకాల గురించి వివరించారు. ప్రొద్దుటూరు మండల సీఆర్పీలు ఎస్.బాస్కర్, జి.నాగేంద్ర, టి.వరప్రసాద్, జి.మునిశేఖర్, గాయత్రి, సరస్వతి, రమాదేవి, హెలీనా, ఖదిరున్నీసా, సువార్తమ్మ పాల్గొన్నారు.

తైక్వాండోలో మైదుకూరు విద్యార్థుల ప్రతిభ



పతకాలు, సర్టిఫికెట్లతో తైక్వాండో విద్యార్థులు

మైదుకూరు : టెంపుల్ ఆఫ్ తైక్వాండో వారు తిరుపతిలో ఈనెల 11, 12 తేదీల్లో నిర్వహించిన తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో మైదుకూరు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మొదటి ఓపెన్ సౌత్‌జోన్ తైక్వాండో చాంపియన్ షిప్-2023 పేరుతో జరిగిన ఈ పోటీల్లో మైదుకూరు నుంచి 41 మంది పాల్గొన్నట్టు మాస్టర్ జిలానీ బాషా, ట్రైనర్లు సాగర్ ఝాన్సీ, బీవీ బాలాజి తెలిపారు. వీరిలో 20 మంది బంగారు. 17 మంది వెండి, మిగిలిన వారు కంచు పతకాలను సాధించినట్లు వారు పేర్కొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే



అలరించిన విద్యార్థినుల గేయాలు

పోరుమామిళ్ల : జీవితంలో రాణించేందుకు, సమాజంలో విలువలతో గౌరవంగా బతికేందుకు, ఉన్నత స్థానం సాధించేందుకు విద్య అవసరమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరేష్, వైస్ ప్రిన్సిపాల్ ప్రకాష్ పేర్కొన్నారు. 2022-2023 విద్యార్థులకు ఆహ్వానం పలుకుతూ సోమవారం కళాశాలలో జరిగిన ఫ్రెషర్స్‌డే సభలో వారు మాట్లాడారు. ప్రతి విద్యార్థి విలువలు కలిగిన విద్య నేర్చుకున్నపుడే ఎక్కడైనా గౌరవం దక్కుతుందన్నారు. చదువుకోవాల్సిన వయసులో అల్లరిగా తిరిగితే అల్లరి పాలవుతారన్నారు. విద్యార్థికి ఉన్నత లక్ష్యం ఉండాలని, అందుకు కష్టపడాలన్నారు. సభలో సీనియర్ విద్యార్థులు ప్రసంగించారు. అనంతరం ఫ్రెషర్స్‌డే సభలో విద్యార్థుల పాటలు, ఆటలు అలరించాయి.

హమారా ప్రసాద్‌పై పీడీ యాక్ట్ నమోదు చేయాలి

బద్వేలు అర్బన్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌పై పీడీ యాక్ట్‌తో పాటు రాజద్రోహం కేసు నమోదు చేయాలని పూలే, అంబేడ్కర్ రాజ్యాధికార సమితి జిల్లా కో-ఆర్డినేటర్ పిచ్చయ్య, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు పి.వెంకటరమణ, మాలమహాసేన రాష్ట్ర కార్యదర్శి మీసాల రవిలు పేర్కొన్నారు. సోమవారం స్థానిక సిద్ధవటం రోడ్డులోని మాల మహాసేన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అంబేడ్కర్ బతికి ఉంటే గాంధీని గాడ్సే కాల్చినట్లు తాను కూడా అంబేడ్కర్‌ను కాల్చి చంపేవాడినని హమారా ప్రసాద్ బహిరంగంగా ప్రకటించడం ఆయన కుల దురహంకారానికి నిదర్శనమన్నారు. సమావేశంలో పూలే, అంబేడ్కర్ రాజ్యాధికార సమితి తాలూకా అధ్యక్షుడు ఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతను నివారించడమే ప్రభుత్వాల లక్ష్యం



ఐసీడీఎస్ సిబ్బందితో మాట్లాడుతున్న పరిశీలకుడు వెంకటేష్

కమలాపురం: గర్భవతులు, బాలింతల్లో రక్త హీనతను నివారించడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం అని నీతి అయోగ్ పరమల్ ఫౌండేషన్ పరిశీలకుడు వెంకటేష్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం కమలాపురం పట్టణంలోని 14వ వార్డు 4వ, 3వ అంగన్వాడీ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో ఉన్న రికార్డులను, హాజరు పట్టికలను, గర్భవతులు, బాలింతల వివరాలను పరిశీలించారు. అలాగే సెంటర్‌కు వచ్చిన గర్భవతులు, బాలింతలతో వారికి అందుతున్న పౌష్టికాహారం, వైఎస్సార్ సంపూర్ణ పోషణ పంపిణీపై ఆరా తీశారు. అలాగే రోజు మధ్యాహ్నం సెంటర్లలోనే భోజనం తింటున్నారా? రుచికరంగా ఉందా? అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు కోడిగుడ్లు, పాలు ఇస్తున్నారా? అని చిన్నారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీల పనితీరు, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మేరీ జయకుమారి, పార్వతి, వర్కర్లు సునీత, సురేఖ పాల్గొన్నారు.

ఉచిత డ్రైవింగ్ శిక్షణ

కమలాపురం: హైదరాబాద్‌కు చెందిన అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కమలాపురం యువతకు ఉచితంగా డ్రైవింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్లు మదర్ థెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు జూటూరు విజయ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమలాపురం పట్టణానికి చెందిన శ్రీ లక్ష్మీదుర్గ టెక్నికల్ డ్రైవింగ్ స్కూల్‌లో 20 రోజులు డ్రైవింగ్‌లో శిక్షణతో పాటు మరో 10రోజుల థియరీ క్లాసులు చెబుతారని ఆయన అందులో పేర్కొన్నారు. అనంతరం ఎల్ఎల్ఆర్ లైసెన్స్, సర్టిఫికెట్స్ ఇప్పిస్తామన్నారు. 19-35 సంవత్సరాల్లోపు ఉన్న యువకులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన యువకులు ఆధార్, రేషన్ కార్డు, మార్క్‌లిస్ట్, 4 పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.500 అభయ ఫౌండేషన్ పేరిట చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, శిక్షణ అనంతరం రూ.500 తిరిగి చెల్లిస్తారని అన్నారు.

భక్తి శ్రద్ధలతో పంచముఖీ గాయత్రి యజ్ఞం

కమలాపురం: స్థానిక స్వామి వివేకానంద హైస్కూల్ ప్రాంగణంలో శ్రీ పంచముఖి గాయత్రి యజ్ఞం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గాయత్రి పరివార్-ఋషికేష్ వారి ఆధ్వర్యంలో గురురాజారావు, నాగపాటి రాజాగురూజీ పర్యవేక్షణలో పంచముఖ గాయత్రి యజ్ఞం ఘనంగా నిర్వహించారు. సమీప ప్రాంతాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని హోమాలు, యజ్ఞాలు, ప్రత్యేక పూజలు చేశారు.